

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 32 | సంచిక : 3 | నవంబరు 2026

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (ఫ్రైమ్)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

గుడ్డురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు. 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(సందిగాము శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు. 9397151342

ఈ సంచికలో. . . .


బంధం - మాయ 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు..... 5

అరుణాచల మహత్మ్యం - అక్షరమణమాల 17

ఇతర విషయములు :

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం



జ్యోతి ప్రజ్వలన అంటే
హృదయంలో జ్ఞానదీపం
వెలిగించుకోమని సంకేతం.
జ్ఞానదీపం వెలిగించుకొంటే
అజ్ఞానం నశిస్తుంది.

ఓం శ్రీనాన్నపరమాత్మనే నమః

బంధం – మాయ

(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి సేకరణ)


జ్ఞానం బంధించదు, రూపం బంధిస్తుంది, నామం బంధిస్తుంది. రూపబుద్ధితోటి నామబుద్ధితోటి ఏదైనా ఒక మంచి పని చేస్తే పుణ్యం రావచ్చు కానీ జ్ఞానం రాదు, శాంతి రాదు. మాయ అంతా మనసులో ఉంది. మనసుని హృదయంలో ఉంచమని, ముంచమని చెపుతారు. మనస్సు హృదయంలో ఉంటే, రూపబుద్ధి తగ్గుతుంది, నామబుద్ధి తగ్గుతుంది. మనస్సు శిరస్సులో ఎంత సహజంగా ఉంటుందో హృదయగుహలో అంత సహజంగా ఉండాలి. మనస్సు మన శిరస్సులో ఉండటానికి మనము ఏమీ సాధన చెయ్యటంలేదు. Day to day life లో మన behaviour abnormalగా ఉండకూడదు. Naturalగా, normalగా ఉండాలి. మనకి భక్తి ఉంటే, అది సహజంగా ఉండాలి. జ్ఞానం సహజంగా ఉంది. నిజం అనేది ఎప్పుడూ సహజంగా సింపుల్‌గా ఉంటుంది. నిజం కానిదే అసహజంగా ఉంటుంది, కృత్రిమంగా ఉంటుంది.

ఇప్పుడు ఏదైతే మనం నేను నేను అంటున్నామో అది సహజమైన నేను కాదు. ఏదైతే సహజమైనదో అది సత్యమైనది. ఏదైతే సహజమైనది కాదో అది సత్యమైనది కాదు. ఎవరో మనలను బంధించేస్తున్నారు అనుకుంటాము. మన మనస్సే మనని బంధిస్తోంది అనే బుద్ధి మనకింకా రాలేదు. ఎవడో బంధించేస్తున్నాడు అనుకోవటం, వాళ్లని వీళ్లని పట్టుకొని తిట్టటం, హృదయంలో ఉన్నదేవుడిని వదిలేయటం, అక్కడికి ఇక్కడికి తిరగటం. అసలు మన మనస్సు లోపలికి ఎందుకు వెళ్లటంలేదు అంటే, మనకు గుళ్లో ఉన్న దేవుడి మీద ఉన్న నమ్మకం కూడా హృదయంలో ఉన్న దేవుడి మీద లేదు. హృదయంలో అంతర్యామిగా ఉన్న దేవుడి మీద నమ్మకం లేనప్పుడు మనస్సు అక్కడికి ఎందుకు వెళ్తుంది, అది గుడి చుట్టూ తిరగమంటే తిరుగుతుంది. అంటే గుడి చుట్టూ తిరగకూడదు అని కాదు, మనకి రూపబుద్ధి ఉంది కాబట్టి అది అవసరమే, కాదనటంలేదు. మన హృదయంలో దేవుడు లేడు అనుకొంటున్నాము, దేవాలయంలో ఉన్నాడు అనుకొంటున్నాము. నిజమైన దేవుడు, 100% సత్యమైనటువంటి దేవుడు మన హృదయంలోనే ఉన్నాడు. మనని నియమించేవాడు, మన ప్రభువు, మన

గోవిందుడు, శ్రీనివాసుడు మన హృదయంలోనే ఉన్నాడు. ఉండటమే కాదు, ఆయన మనలను నియమిస్తున్నాడు, నిశ్శబ్దంగా పని చేస్తున్నాడు, నిరహంకారంగా చేస్తున్నాడు. ఆయన మన లోపల ఉన్నాడు, శబ్దం లేదు, నిశ్శబ్దంగా పని చేస్తున్నాడు. రోజూ మనం బయట తిరగటానికి అలవాటు పడిపోయి, శబ్దానికి అలవాటు పడిపోయి, మనకి నిశబ్దం అంటే ఇష్టం ఉండదు. మనకు ఇంట్లో అల్లరి ఉండాలి, ఊళ్లో అల్లరి ఉండాలి, దేశంలో అల్లరి ఉండాలి. న్యూస్‌పేపర్లకి రోజూ ఏదో వార్తలు ఉండాలి కదా.

అడవి ప్రాంతాలలో కోతులు ఎక్కువ తిరుగుతాయి. కోతులని తొందరగా పట్టుకోలేము. కోతులని పట్టుకొనేవాళ్ళు దానికి ఒక ఉపాయం చేస్తారట. దాని గురించి ఒక కథ చెపుతారు. ఈ కథ భక్తుల గురించి చెప్పారు! కోతి తినేది తక్కువ, పాడుచేసేది ఎక్కువ. మన మనస్సు కూడా కోతే. కోతులు ఆ రొబ్బ మీదకు ఈ రొబ్బ మీదనుంచి ఉరుకుతూ ఉంటాయి. మన మనస్సు కూడా ఆ తలంపు నుంచి ఈ తలంపు, ఈ తలంపు నుంచి ఆ తలంపు మీద ఉరుకుతూ ఉంటుంది. ఆ తలంపు, ఈ తలంపు మధ్యన కొంత ఖాళీ ఉంటుంది. ఆ ఖాళీ చూడటం మనకి ఇంకా అలవాటు అవ్వలేదు. కోతులకు ఎన్ని లక్షణాలు ఉంటాయో మన మనస్సుకి కూడా అన్ని లక్షణాలు ఉంటాయి. అసలే కోతి, అది సారా తాగింది, సారా తాగాక తేలు కుడితే ఇంకెలా ఉంటుందని! అసలే మన మనస్సు కోతి, మళ్లీ దానికి కోపం వచ్చింది, కోపం వచ్చాక మళ్లీ కోరిక, తరువాత క్షోభ ఒకటి వచ్చింది. అప్పుడు ఇంక ఎలా ఉంటుంది?

కోతులని పట్టుకొనేవాడు ఆ కోతులు తిరిగే చోట వాటికి కనపడేలా ఒక కూజాలో జీడిపప్పు పెడతాడు. కోతి చెయ్యి పెట్టడానికి చిన్న మూతి ఉన్న కూజా పెడతాడు. అందులో కోతి చెయ్యి మటుకే దూరుతుంది. ఈ కథ భక్తులందరికీ వర్తిస్తుంది. ఆ కోతి వచ్చి జీడిపప్పు చూస్తుంది. జీడిపప్పు కోసం దాని చెయ్యి నెమ్మదిగా సీసాలోకి దూరుస్తుంది, ఆ చెయ్యి లోపలికి వెళ్ళటానికి సరిపడ మాత్రమే కూజా మూతి వెడల్పు ఉంటుంది. చెయ్యి లోపలికి పంపేసి, గుప్పిట నిండా జీడిపప్పు పట్టేస్తుంది. మళ్లీ చెయ్యి బయటికి లాక్కోవటానికి ప్రయత్నం చేస్తుంది. ఆ గుప్పిట రాదు. రావటం లేదు ఏంటి, లోపల ఎవడో పట్టేసుకున్నాడు అనుకొంటుంది. మనం కూడా అలా అనుకుంటాము కదా, మాయ పట్టేస్తోంది అని. మాయ పట్టేయలేదు, ఆ గుప్పిటలో ఉన్న జీడిపప్పు వదిలేస్తే చెయ్యి బయటికి వచ్చేస్తుంది. కానీ ఆ



జీడిపప్పు అలా పట్టుకుని ఉంచుతుంది. గోల గోల చేస్తుంది కానీ గుప్పిటలో ఉన్న జీడిపప్పు విడిచిపెట్టదు. ఆ గుప్పిటతోటి చెయ్యి బయటికి రాదు. తన చేతిలో ఉన్న జీడిపప్పు వదిలేస్తే చెయ్యి బయటికి తీసుకోవచ్చు అని దానికి బుద్ధి రావటం లేదు. ఎవడో పట్టేశాడు అనుకొంటుంది. మనం కూడా అంతే. అంటే, ప్రపంచంలో ఎన్నో ఆకర్షణలు మనస్సుకి ఉన్నాయి. మనకు వేల కోరికలు ఉన్నాయి. ఒక్క కోరిక తీరితే, ఆ తీరిన కోరిక ఇంకొక పది కొత్త కోరికలని తీసుకొస్తుంది. ఆ కోతి గుప్పిటే దాన్ని పట్టేసింది, కానీ లోపల జాడీలో ఎవడో ఉండి దాన్ని పట్టేశాడు అనుకుంటోంది. మనం కూడా అంతే, మన మనసే మనని పట్టేసుకుంటోంది. మన మనస్సులో ఉన్న కొరికలే మనల్ని పట్టుకొంటున్నాయి. మన మనస్సులో ఉన్న రాగద్వేషాలే, కామక్రోధాలే మనని పట్టేసుకొంటున్నాయి. మన కోపాలు, ఉద్రేకాలు, మన వేరుబుద్ధి, ఇవే మనల్ని పట్టేసుకొంటున్నాయి. మన మనస్సులో ఉన్న కాంక్షలు, తలంపులు, కోరికలు, వికారాలు, ఆకారాలు, ఇవే మనని పట్టేసుకొంటున్నాయి అని మనకి తెలియక, ఎవరో వచ్చి పట్టేసుకొంటున్నారు అని ఆ పట్టుకున్న వాడిని విడిపించ టానికి మళ్లీ గుడుల చుట్టూ తిరగటం, ఇదీ మన పరిస్థితి. ఆ కోతుల కథ సరిగ్గా మనకి వర్తిస్తుంది. మన మనసే మనని బంధిస్తోంది. గుప్పిట వదిలేస్తే చెయ్యి బయటికి వచ్చేస్తుంది అని కోతికి అర్థం అవ్వటం లేదు, ఎందుచేత అంటే దానికి జీడిపప్పు మీద ఆశ. అలాగే ఈ లోకం మీద, దేహం మీద ఉన్న ఆశ, మమకారం ఇవన్నీ మనలను బంధిస్తున్నాయి. అహంకారంతో ఏదో సాధించెయ్యాలి, దేవుడిని కూడా కాదని ఏదో సాధించెయ్యాలి, గొప్పలు తెచ్చుకోవాలి అని మనకు దురాశ, కాంక్ష. గొప్పలు తెచ్చుకుంటే, గొప్పలు రావచ్చు, అసలు సున్న. ఎవడైతే ఆత్మని అనుభవైకవేద్యం చేసుకోలేదో, తన హృదయంలో ఉన్న సత్యాన్ని అనుభవైకవేద్యం చేసుకోలేదో, వాడు దుఃఖం లోనుంచి, అశాంతి లోనుంచి, కర్మచక్రంలో నుంచి బయటికి వచ్చే సమస్య లేదు, వాడికి స్వేచ్ఛ లేదు, సుఖం లేదు, శాంతి లేదు.

మూలం: సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 8 జనవరి 2005, కొమరగిరిపట్నం

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 18 ఆగష్టు 1985, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఉన్నది ఆత్మ ఒక్కటే, మిగతాది అంతా జడం. మన శరీరం జడం, మన మనస్సు జడం, మన అహంకారం జడం, మన ఇంద్రియాలు జడం. ఇప్పుడు నేను మీ అందరి వంక చూస్తున్నాను. మీరు నాకు కనిపిస్తున్నారు, సూర్యుడి వెలుతురు లేదు అనుకోండి మీరు ఎవరైనా నాకు కనిపిస్తారా? కనపడరు. సూర్యుడు అస్తమించాడు అనుకోండి అప్పుడు వెలుతురు కావాలి, అంటే లైటు వేసుకుంటాము. అప్పుడు మీరు అందరూ నాకు కనిపిస్తారు. ఇప్పుడు సూర్యుడి వెలుతురు వల్ల కనిపిస్తారు, అప్పుడు ట్యూబ్ లైట్ వేసుకుంటే మీరు అందరూ కనిపిస్తారు. ట్యూబ్ లైట్ లేదు, సూర్యుడి యొక్క వెలుతురు లేదు అనుకోండి మీరు నాకు కనిపిస్తారా? కనబడరు. ఉండటం ఉన్నారు కానీ మీరు ఎవరూ కనపడరు. అంటే మిమ్మల్ని చూడటానికి నాకు వెలుతురు సహాయం అవసరం. వెలుతురు లేకపోతే మీరు ఇక్కడ కూర్చున్నప్పటికీ నేను మిమ్మల్ని చూడలేను. అయితే నేను ఉన్నాను అని నాకు తెలియటం కోసం సూర్యుడి వెలుతురు నాకు అక్కర్లేదు. దీపం వెలుతురు నాకు అక్కర్లేదు. రాత్రి నిద్రలో మెలకువ వస్తుంది అనుకోండి. మెలకువ వచ్చినప్పుడు నేను ఉన్నాను అని నాకు తెలియటం కోసం ట్యూబ్ లైట్ అక్కర్లేదు. సూర్యుడి వెలుతురు అక్కర్లేదు. అంటే చీకటిలో కూడా నేను స్వయంగా ప్రకాశిస్తున్నాను అందుచేత ఆత్మ స్వయం ప్రకాశి. మనకి తల్లి కడుపు లోంచి ఒక రూపం వచ్చింది దానికి ఒక పేరు పెట్టారు. మనల్ని ఆకర్షించేది, మోహంలో పెట్టేది, అజ్ఞానంలో పెట్టేది, రూపమే. మరణించిన తరువాత మనకి అస్థిత్వం ఉందదేమో అనుకుంటున్నాం. మరణించిన తరువాత అస్థిత్వం ఉంటుంది, మరణించటం వల్ల రూపం మారుతుంది, నామం మారుతుంది. దేహం మరణిస్తుంది. దేహం మరణించినపుడు ఇంకొక దేహం వస్తుంది, అంటే రూపం మారుతుంది. రూపం ఎప్పుడైతే మారిందో పేరు మారుతుంది. అంటే లోకానికి వచ్చేటప్పటికి లోకానికి

సంబంధించిన ఒక రూపం ఉండాలి, పేరు ఉండాలి. మీకు రూపం లేకపోతే, పేరు లేకపోతే లోక వ్యవహారం నడవదు. మనం మరణించాం అంటే రూపం మారుతుంది. రూపం మారినప్పుడు కొత్త శరీరం వస్తుంది. దానికి ఒక నామం వస్తుంది. మరణిస్తాం, మీరు రూపం తీసేయండి, నామం తీసేయండి. ఇంక అప్పుడు లోకం ఎక్కడ ఉందో చూడండి. బయట వాళ్లు ఎవరు? లోపల నేను ఎవరు? నేను మీకు వేరుగా ఉందా? ఉన్నది ఒక్కటే వస్తువు ఆత్మ వస్తువు. మరి నేను ఎవరిని? ఆత్మ గురించి శ్రవణం చెయ్యమన్నారు. ఎందుచేత శ్రవణం చెయ్యమన్నారు? అది మీరే.

నా మాయని ఎవరు అతిక్రమించలేరు అని పరమాత్మ గీతలో చెప్పాడు. రెండు శక్తులు ఉన్నాయి మళ్ళీ, ఒకటి ఆవరణ శక్తి, రెండు విక్షేప శక్తి. ఆవరణ అంటే మరుగు పరుస్తుంది. నేను ఆత్మని అన్న సంగతి నా అనుభవంలోకి రాకుండా ఆపేది ఆవరణ శక్తి. నేను ఆత్మను అయినప్పటికీ, అది నా అనుభవంలోకి రాకుండా ఈ మాయ నేను మరుగు పరుస్తుంది. అంటే అది కమ్మేస్తుంది. సూర్యుడిని మేఘం ఎలా కమ్ముతుందో, అలా ఆవరణ నా స్వరూపాన్ని కమ్ముతుంది. ఇది మాయ యొక్క శక్తి. నామ రూపాల మీద భ్రాంతి కలగడం విక్షేపానికి సంబంధించినది.

భగవాన్ ఒకసారి అన్నారు ఈ అహంకారం అంటే మీరు సామాన్యం అనుకోకండి. అది ఏనుగు లాంటిది. ఏనుగు సింహానికి లొంగుతుంది కానీ మామూలు లొట్టి పిట్టలకి లొంగదు. ఇక్కడ అహంకారం అనే ఏనుగుకు సింహం ఎవరు అంటే గురువు యొక్క

ఎవరైతే అరుణాచలం అరుణాచలం అని స్మరిస్తున్నారో వారికి తెలియకుండానే వారి అహంభావనను, దేహబుద్ధిని దొంగతనం చేసి అరుణాచలేశ్వరుడు పట్టుకొనిపోతాడు. అదీ అరుణాచల స్మరణ వలన వచ్చే లాభం.



కటాక్షం, ఈశ్వరుడి యొక్క కటాక్షం. మీరు కర్త అనే భావన వచ్చినప్పుడు దానిని అహంకారం అంటారు. ఈ విశాలమైన ప్రపంచంలో అందరూ ఒకే పని చేస్తున్నారా? చెయ్యటం లేదు. ఎవరి వాసన బట్టి వాళ్ళు ఆ పని చేస్తున్నారు. అంటే ఎవరి వాసన బట్టి వాళ్ళకి తత్సంబంధమైన భోగం వస్తుంది అని ఆ పని చేస్తున్నారు. నీ ఇంద్రియాల తోటి నువ్వు పొందే అనుభవాన్ని భోగం అంటారు. ఆ భోగం కోసం మనం డబ్బు సంపాదిస్తాం. డబ్బు లేని వాడికి భోగం ఎక్కడ నుంచి వస్తుంది? మనం జీవిస్తున్న జీవితం మనస్సుకి, రాత్రి మనకి వచ్చే స్వప్నాలు మనసుకి, గాఢనిద్ర కూడా మనస్సుకే. అయితే మూడు అవస్థలు ఎవరికి అంటే మైండ్‌కే. మనకళ్ళతో చూస్తున్న ప్రపంచం ఎవరికి? మనస్సుకే. మనస్సు ఉంది కాబట్టి ప్రపంచాన్ని ఎంజాయ్ చేస్తాం. మనస్సు చెడిపోయిన వాడికి ప్రపంచం కావాలా? నీకు వేరుగా నువ్వు ఏది అనుభవించినప్పటికీ నువ్వు ఆత్మ కాదు. నీకు వేరుగా ఏది చూస్తున్నప్పటికీ నువ్వు ఆత్మ కాదు. మనకి కోపం వస్తుంది. ఎవరికి కోపం వస్తుంది? నాకు కోపం వస్తుంది. మనస్సుకి వస్తుందా లేకపోతే అహంకారానికి వస్తుందా? ఆత్మకి వస్తుందా? నేనొక వ్యక్తిని అనుకుంటున్నాను కాబట్టి నాకు కోపం వస్తుంది. వ్యక్తి అంటే ఇక్కడ ఎవడు? అహంకారం. నాకు వ్యక్తి భావన ఎప్పుడైతే వచ్చిందో అప్పుడు కోపం వస్తుంది. నాకు కోపం వస్తుంది అది నాకు కనిపిస్తుంది. కనిపించేది ఆత్మ ఎలా అవుతుంది? కోపమే కాదు. మీకు ఏ కోరిక వచ్చినా, మీకు కనిపిస్తుందా, లేదా? కోరిక ఎక్కడ వస్తుంది? మనసులో వస్తుంది. మనసులో ఈ కోరిక వస్తోంది అన్నప్పుడు మీకు కోరిక కనిపిస్తోందా, లేదా? అంటే ఇప్పుడు నాకు ఈ కోరిక వచ్చింది అని మనసుకి వేరుపడి మీరు చూస్తున్నారా, లేదా? మీకు మంచి కోరికలు రావచ్చు, చెడ్డ కోరికలు రావచ్చు. ఆ కోరికలని మీరు చూస్తున్నారా, లేదా? ఆ చూసేవాడు ఎవడు?

మనిషి పాపం చెయ్యడానికి ఒక్కటే కారణం. ఈ జన్మలో కానీ, పూర్వ జన్మలో కానీ, రాబోయే జన్మలో కానీ, దేహమే ఆత్మ అనుకున్నంతకాలం మనిషి పాపం చేస్తూనే ఉంటాడు. అందుకే నువ్వు పాపాన్ని దాటు, పాపాన్ని అతిక్రమించు అని వేదాలలో చెప్పారు.

అయితే మనిషి ఎంతకాలం పాపం చేస్తూ ఉంటాడు? తన అస్థిత్వాన్ని దేహానికే పరిమితం చేసినంత కాలం, నేను దేహమాత్రుడని అని తాను అనుకున్నంత కాలం మనిషి పాపం చెయ్యటం మానడు. నేను దేహన్ని అనుకుంటున్నాను. అందుచేత దేహం మరణించినప్పుడు నేను మరణిస్తున్నాను అనుకుంటున్నాను, దేహం జన్మించినప్పుడు నేను జన్మించాను అనుకుంటున్నాను. అంటే ఏమిటి? ఆత్మని ఈ దేహానికి పరిమితం చేసేశాను. దేహాన్ని ఆత్మ అనుకుంటున్నాను. దేహాన్ని ఆత్మ అనుకునే బుద్ధి ఎంతకాలం అయితే ఉందో, అంతకాలం వాడు పాపం చేసి తీరతాడు. ఎంతకాలం ద్వైతబుద్ధి ఉందో అంతకాలం వాడికి సందేహాలు వస్తూనే ఉంటాయి. ఎంతకాలం ద్వైతబుద్ధి ఉందో వాడికి కోపం పుడుతుంది, కామం పుడుతుంది. తనకంటే వేరుగా వస్తువు ఉండేటప్పటికి కాంక్ష కలుగుతుంది. తనకంటే వేరుగా వస్తువు లేనప్పుడు కాంక్ష ఎక్కడ నుంచి వస్తుంది? మీకు వేరుగా వస్తువు ఉంది అనుకోండి ఇప్పుడు, తాత్కాలికంగా మీరు అణిగి ఉన్నప్పటికీ ఎప్పుడో ఒకప్పుడు మీకు కోరిక కలుగుతూనే ఉంటుంది. ఎవడు ధీరుడు అంటే ఎవడైతే తన మనస్సును అంతర్ముఖం చెయ్యగలుగుతున్నాడో వాడే ధీరుడు. ధీరుడు అంటే మనుషులని చంపేవాడు ధీరుడు కాదు. జంతువులని చంపే వాడు ధీరుడు కాదు. ఎవడైతే తన మనస్సును అంతర్ముఖం చెయ్యగలుగుతున్నాడో వాడే ధీరుడు.

మీ అనుగ్రహం కావాలి అని భగవాన్ ని ఎవరైనా అడిగితే, నీ దేహమెంతో, ఈ దేహం అంతే, ఈ శవమా నిన్ను అనుగ్రహించేది? దీనిని కాలిస్తే బూడిద అవుతుంది. ఇదా మిమ్మల్నిఅనుగ్రహించేది? దేహాలు వేరు కానీ, మనసులు వేరు కానీ, అహంకారాలు వేరు కానీ ఆత్మ ఒక్కటే! మాకు అందరికీ మోక్షం కావాలి, మాకు అందరికీ మోక్షం కావాలి అని మీరు అందరూ అనుకోవచ్చు. నీ లోపల ఉండి నాకు మోక్షం కావాలి, నాకు మోక్షం కావాలి అని కోరేవాడు ఎవడు? ఎప్పుడైనా ఈ ప్రశ్న మీలో ఉదయించిందా? నిజమైన గురువు మిమ్మల్ని సత్యం వైపుకి తీసుకుని వెళ్ళడానికి ప్రయత్నం చేస్తాడు కానీ మీగొప్పల కోసం, మీ మన్ననలు కోసం చూడడు. ఈ దేహం నువ్వు కాదు, ఈ మనస్సు నువ్వు కాదు అని, మిమ్మల్ని

ఆత్మ వైపుకి తీసుకు వెళ్ళేవాడు గురువా? లేకపోతే దేహభావనని, మానసికభావనని, అహంకారభావనని పెంచేవాడు గురువా? దేహభావన ఎలాగూ నీకు ఉంది కదా, దీనిని ఇంకా అభివృద్ధి చేసేవాడు గురువా? దేహభావన నుంచి విడదీసి అహంకారం నుంచి విడదీసి, మనస్సు నుంచి విడదీసి, ఆత్మ వైపు ప్రయాణం చేయించే వాడు గురువా? teaching అనేది cheating కోసం కాదు. అంటే బోధ అనేది మోసం చెయ్యటం కోసం కాదు. మోసం చెయ్యడానికి బోధ ఎందుకు? జ్ఞానికి గొప్ప ఎందుకు తనకంటే వేరుగా ఒకడు ఉంటే కదా, తనకంటే వేరుగా వస్తువే కనపడదు. ఇంక గొప్పతోటి పనేముంది? గొప్పలు దాటకుండా వాడు జ్ఞానే అవ్వలేడు. గొప్ప ఎవడికి కావాలి? తనకంటే వేరుగా ఎవరైనా కనిపించినప్పుడు, వాడు గొప్ప. తనకంటే వేరుగా వస్తువే కనపడదు. ఇక గొప్ప తోటి పని ఏముంది వాడికి? ఆత్మని తెలుసుకునే వరకు ప్రతీ వాడు జీవే. మనం కళ్ళతోటిచూసేవి అన్నీ కూడా ఏనాడో మనం చేసినవి ఇప్పుడు మనకి కనిపిస్తున్నాయి. మనం కర్తృత్వం తోటి చేస్తాం, దాన్ని బట్టి వాసన పుడుతుంది. ఆ వాసనలే లోకంలో కనిపిస్తాయి. మనం చేసినవే కనిపిస్తాయి, కానీ చెయ్యకపోతే ఏమీ కనపడదు.

మనకు పెద్ద ధనవంతుడు కనిపించాడు అనుకోండి, వాడు చాలా గొప్పగా మన కళ్ళకు కనిపిస్తాడు. కారణం వాడు గొప్పవాడు కాదు మన వాసన బట్టి వాడు గొప్పవాడి కింద కనిపిస్తాడు. వాడు ఆత్మే. మీకు విద్యకి సంబంధించిన వాసన ఉంటే బాగా చదువుకున్నవాడు చాలా గొప్పవాడి కింద కనిపిస్తాడు. మీకు కీర్తికి సంబంధించిన వాసన ఉంది అనుకోండి బాగా కీర్తి ఉన్నవాడు గొప్పవాడి కింద కనిపిస్తాడు వాడికి చదువు లేకపోయినా సరే, దానం లేకపోయినా సరే. వాసనే ఈ లోకాన్ని కల్పిస్తుంది, వాసనాక్షయం అయిన వాడికి దేవుడి తోటి పని లేదు, లోకం తోటి పనిలేదు, మాయ తోటి పని లేదు. లోపల వాసన లేకపోతే బయట ఏది కనపడదు. అది మీరు పరిశీలన చేసి చూసుకోండి.

భగవాన్ ఎక్కడికీ వెళ్ళేవారు కాదు కానీ, రామకృష్ణులు ఎవరైనా శిష్యులుపిలిస్తే వారి ఇంటికి వెళ్ళేవారు. అది చాలా పెద్ద భవనం. మంచి మంచి రంగులు వేశారు.

రామకృష్ణుడి శిష్యుడు ఒకడు "ఇది ఎంత గొప్ప మేడ, ఎన్ని మంచి రంగులు వేశారు" అన్నాడు. "ఎంత గొప్ప మేడ అయినా ఇటుకలు తోటి, సిమెంటు తోటి కట్టేదే కదా" అంటాడు రామకృష్ణుడు. అంటే ఎక్కడికక్కడ ఎలా కోసేస్తున్నాడో చూడండి, మనకి రూపదృష్టి తీసుకువస్తుంది మేడ. ఆ మేడలో, ఇటుకలు ఉన్నాయా, సిమెంటు, సున్నం ఉన్నాయా మనకు అక్కర్లేదు. వెంటనే మనకు రూపదృష్టి వచ్చేస్తుంది. రూపం యొక్క సహజ లక్షణం ఏమిటి అంటే రూపం మనసుని ఆకర్షిస్తుంది. రూపం లేకుండా అహంకారం నిలబడదు. అహంకారం ఉండలేదు. అందుచేత ఒక రూపాన్ని పట్టుకుంటుంది. ఆ రూపాన్ని విడిచి పెట్టి ఇంకొక రూపాన్ని పట్టుకుంటుంది. ఆ రూపాన్ని విడిచి పెట్టాక ఇంకొక రూపాన్ని పట్టుకుంటుంది. రూపాన్ని విడిచి పెట్టి ప్రత్యేకంగా అహంకారానికి అస్థిత్వం లేనే లేదు. ఈ దేహం నాది, ఈ దేహం నాది అని అనుకుంటున్నాను అనుకోండి, ఈ దేహం కాలిపోయిన తరువాత ఇంకొక దేహం వస్తుంది. ఆ దేహం నాది, ఆ పేరు నాది అనుకొంటాను. ఇంక ముందు దేహం గొడవ కాని, ఆ పేరు గొడవ కాని నాకు అసలు ఉండదు. ఎందుచేత? నేను ఆ దేహాన్ని వదిలేశాను, ఆ పేరుని వదిలేశాను. కొత్త దేహం తోటి కలిశాను, కొత్త పేరు తోటి కలిశాను కాబట్టి ఆ దేహం ఏమైపోయినా, ఆ పేరు ఏమైపోయినా నాకు అక్కర్లేదు.

మనం ఎక్కడైనా అద్దె ఇంట్లో ఉంటున్నాం అనుకోండి, కొత్త ఇల్లు చూసుకున్నాకే ఈ ఇల్లు ఖాళీ చేస్తాం. అంతవరకు ఉండవయ్యా నాకు కొత్త ఇల్లు ఎక్కడా దొరకలేదు అంటాం. మన అహంకారం కూడా కొత్త దేహాలు ఎక్కడో చూసుకుని ఇది ఖాళీ చేస్తుంది. దేహం లేకపోతే అది ఉండలేదు, రూపం లేకపోతే అది ఉండలేదు, నామం లేకపోతే ఉండలేదు. దానికి రూపం, నామం ఆహారం. ఈ జన్మలో ఏదో ఒక రూపాన్ని పట్టుకుని వేలాడుతూ ఉంటుంది, ఏదో ఒక నామాన్ని పట్టుకుని వేలాడుతూ ఉంటుంది. ఆ రెండిటిని తీసేసి ప్రత్యేకంగా నువ్వు నిలబడు అంటే నిలబడటానికి అవకాశం లేదు. అలాగని దానికి రూపం ఉందా అంటే దానికి రూపం లేదు. అది మనకి కనపడదు. అహంకారానికి

రూపం లేదు, కానీ బయటకి కనిపిస్తున్న రూపాలు దానికి కావాలి.

ఒకసారి రామకృష్ణుడితోటి నరేంద్రుడు "మేము మీ దగ్గరకి చూడటానికి వస్తున్నాం అని కలకత్తా సిటీలో ఉన్న కొంతమంది లౌకికులు మమ్మల్ని విమర్శిస్తున్నారు" అన్నాడు. అప్పుడు "నిన్ను చూసి నవ్వే వాళ్ళని, నిన్ను చూసి వేళాకోళం చేసే వాళ్ళని చూసి నువ్వు ఏమనుకుంటున్నావు" అని అడిగాడు రామకృష్ణుడు. "వాళ్ళందరినీ చూసి యముడిని చూసి కుక్కలు మొరుగుతున్నాయి అనుకుంటున్నాను" అని నరేంద్రుడు అనగా రామకృష్ణుడు "అంతదూరం వెళ్ళిపోకు, వాళ్ళని కుక్కలు అనుకోకు. ఎందుకంటే అహంకారం పుడుతుంది" అన్నారు. విజృంభిస్తున్న మనసుని ఆపు చేయటం కోసం బ్రేక్ వేశాడు రామకృష్ణుడు. నిజమైన గురువు చేసే పని అది. "వాళ్ళు అనుకుంటే అనుకున్నారు. అంత నీచభావం తోటి వాళ్ళని చూడకు. కృతజ్ఞత ఎలా ఉంటుందో తెలియని మనిషి మాంసం నక్కలు, కుక్కలు కూడా తినవని రామాయణంలో వాల్మీకి చెప్పాడు. నేను చెప్పింది కాదు. మాంసాన్ని ఇష్టంగా తినే జంతువులు కూడా కృతజ్ఞత అనేది ఎలా ఉంటుందో తెలియని మనిషి మాంసం మటుకి ఆ జంతువులు కూడా తినవు" అని చెప్పాడు. ఆనాడు శ్రీకృష్ణుడు గోపికలని ఉద్ధరించేందుకు గొల్లవాడై పుట్టి ఆవుల్ని కాచినట్టే, ఈనాడు సర్వేశ్వరుడే తిరిగి అవతారం ఎత్తి మాబోటి సాధకులని ఉద్ధరించడానికే వంటలు వాడై మాకు బోధించి, జ్ఞానం ఇచ్చి, తన చేతుల తోనే వండి భక్తులకి వడ్డించి అనుగ్రహం ఇచ్చాడు.

దోషరహిత నీవు నాతో నైక్యమయి నిత్యానందమయ మొనర్పురరుణాచలా

దోషాలు లేని స్థితికి మన మనసు ఎప్పుడు ఎదుగుతుంది? మనం చేసే స్నేహాలు



భగవంతుడు మన లోపలే ఉన్నాడు, మనని నియమించేవాడు, మన యజమాని మన లోపలే ఉన్నాడు, వాడిని అనుభవైకవైద్యం చేసుకోవాలి.

విషయంలో జాగ్రత్తగా ఉండాలి, మనం తినే ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి, మనం చేసే పనులు జాగ్రత్తగా ఉండాలి, అప్పుడు దోషాలు లేని స్థితికి మనం ఎదగగలం. ఎదగటం అంటే శరీరం ఎదగటం కాదు. మనస్సు ఎదగాలి, మానసిక వికాసం పొందాలి. ఎలా వస్తుంది మానసిక వికాసం? మాములుగా వస్తుందా అంటే రాదు. మనం చేసే పనులు విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మనం తినే ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మనం చేసే స్నేహాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఇన్ని జాగ్రత్తలు పడితే అప్పుడు మన దోషాలు మనస్సులోనుండి రాలిపోతాయి, కాలిపోతాయి, మాడిపోతాయి, కూలిపోతాయి.

దోషరహిత నీవు – నీకు దోషాలు లేవు. నువ్వు ఎక్కడ ఉన్నావు? దోషాలు లేని స్థితిలో, లోపాలు లేని స్థితిలో నువ్వు ఉన్నావు. అరుణాచలేశ్వరుడా నువ్వు దోష రహితుడవు. లోప రహితుడవు, పాప రహితుడవు. మనకి గురువు రమణ భగవాన్ అయితే రమణ భగవాన్‌కి గురువు ఎవరు? అరుణాచలేశ్వరుడు. గౌతమ బుద్ధుడు కూడా ఎక్కడా గురువు దగ్గర ట్రైనింగ్ అవ్వలేదు. అలాగ రమణ భగవాన్ కూడా గురువు దగ్గర ట్రైనింగ్‌అవ్వలేదు. గౌతమ బుద్ధుడికి కూడా గురువు లేడు. అయితే రమణ భగవాన్‌కి గురువు ఉన్నాడు. మాములుగా బాహ్యంగా లేకపోయినా, అరుణాచలేశ్వరుడినే ఆయన గురువు కింద భావన చేశాడు. దోష రహిత నీవు – ఎక్కడ లోపాలు లేవో, ఎక్కడ పాపాలు లేవో, ఎక్కడ దోషాలు లేవో, ఎక్కడ బలహీనతలు లేవో అక్కడ ఉన్నాడు అరుణాచలేశ్వరుడు. అక్కడకి తీసుకుపో అరుణాచలా అంటున్నాడు. ఒక జ్ఞాని పక్కన మనం కూర్చోవచ్చు. భౌతికంగా ఆయన మనకి ఎంతో దగ్గరగా ఉంటాడు. కానీ ఆయన స్థితి మనకు అర్థం కాదు. గణపతి ముని గారు భగవాన్ దగ్గరకి వచ్చే వరకు దూడలు కాచుకునే కుర్రవాళ్ళు అందరూ కూడా భగవాన్‌ను మనలో ఒకరనే అనుకున్నారు. పైగా వాళ్ళు గోళీ కాయలు తెస్తే ఈయన కూడా వాళ్ళతోటి గోళీ కాయలు ఆడేవారు!

నేను నాలుగు గంటలు సాధన చేస్తున్నాను. ఆరు గంటలు సాధన చేస్తున్నాను

ఇలా మనం లెక్కలు పెట్టుకొంటాము. కానీ సాధన చేసేవాడు ఎవడు? కనీసం ఆ ప్రశ్న ఎప్పుడైనా మీకు వచ్చిందా? ధ్యానం చేస్తున్నాం, ధ్యానం చెయ్యమని భగవాన్ కూడా చెప్పారు. భగవద్గీతలో భగవంతుడు కూడా చెప్పాడు. కానీ లోపల మీలో ఉండి ధ్యానం చేసేవాడు ఎవడు? ఎప్పుడైనా మీకు ఈ అనుమానం కలిగిందా? సోదరమహాశయులారా! మీరు ఎన్ని గంటలు ధ్యానం చేశారు, ఎన్ని రోజులు ధ్యానం చేశారు అన్నది సమస్య కాదు. ఆ ధ్యానం చేసేవాడు ఎవడో మీకు తెలియకపోతే, మీకు జ్ఞానం కలగనే కలగదు. గమ్యం శాశ్వతం. ఆచారాలు నిలబడేవి కావు. కాలాన్ని బట్టి వచ్చేవి ఆచారాలు. గమ్యం అనేది శాశ్వతం. కాలమాన పరిస్థితిని బట్టి ఆచారాలు మారతాయి. ఆచారాలు శాశ్వతం కాదు.

సాధన పేరు మీద మీరు ఎందుకు అంత కష్టపడతారు? ఎందుకు దుఃఖ పడతారు? మీ హృదయంలో ఈశ్వరుడి మీద ప్రీతి ఉందా? జపాలు అంటున్నారు, పూజలు అంటున్నారు, ధ్యానాలు అంటున్నారు, యాత్రలు అంటున్నారు. అలా మీరు కష్టపడుతున్నారు రైటే. కానీ హృదయంలో ఎప్పుడైనా మీకు ప్రీతి పుట్టిందా ఈశ్వరుడి మీద? ఈశ్వరుడి పట్ల ప్రీతి లేకుండా ఈశ్వరుడు దర్శనం ఇస్తాడా? ఒక్క ప్రీతి చాలు ఈశ్వరుడి మీద, మన హృదయంలో ఆ ప్రీతి ఉందా? ఈశ్వరుడి పట్ల ప్రీతి లేకుండా ఎన్ని ధ్యానాలు చేస్తాం, ఎన్ని పూజలు చేస్తాం, ఎన్ని జపాలు చేస్తాం, ఎన్ని యాత్రలు తిరుగుతాం. ప్రీతి ఉందా? కనీసం నీ బిడ్డలని ఎలా ప్రేమిస్తున్నావో, అంతవరకు అయినా ఎప్పుడైనా ఈశ్వరుడిని ప్రేమించావా అంటాడు రామకృష్ణుడు. మీ బిడ్డల పట్ల మీకు ఎంత కుతూహలంగా ఉందో, కనీసం ఆ మాత్రం కుతూహలం అయినా, ఆ మాత్రం ప్రేమ అయినా, ఆ మాత్రం ఆసక్తి అయినా ఎప్పుడైనా ఈశ్వరుడి పట్ల మీ మనస్సుకి కలిగిందా? మీ బిడ్డలని ఏ విధంగా స్మరిస్తున్నావో, కనీసం ఆ మాత్రమైనా ఎప్పుడైనా ఈశ్వరుడిని స్మరించావా?

ఎక్కడ చూసినా పంచ భూతాలే. అమెరికా వెళ్ళినా ఈ గాలి, ఈ నీరు, రష్యా వెళ్ళినా ఈ గాలి, ఈ నీరే. అక్కడ ఏదో ఉంది అనుకుంటాం. ఈ గాలి, ఈ నీరు, ఈ నిప్పు, ఈ ఆకాశమే. ఏముందండీ ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళినా పంచ భూతాలే. ఎవరి


శరీరం తయారు అయినా, స్త్రీ శరీరం అయినా, పురుష శరీరం అయినా, జంతువు శరీరం అయినా, మానవ శరీరం అయినా, ఎవరి శరీరం తయారు అయినా పంచ భూతాల తోటే, లోకంలో ఎక్కడకి వెళ్లి చూసినా పంచ భూతాలే. ఎక్కడో ఏదో ఉంది అనుకుంటాం. అది కూడా పంచ భూతాలే. భగవాన్ కూడా పళిని స్వామి ఉన్నట్టు, రామకృష్ణుడు మేనల్లుడు రామకృష్ణుడు కూడా తిరిగేవాడు. ఇద్దరూ గంగానదిలో స్నానం చేసి, వచ్చేస్తుంటే ఒకసారి గవర్నర్ గారి మేడ అలా చూశాడు ఆయన మేనల్లుడు. మావయ్య, మావయ్య అని కేకలు వేశాడు. నువ్వు చూడకుండా వెళ్ళిపోతున్నావు, గవర్నరు గారి మేడ ఎంత పెద్ద మేడో చూడు మావయ్య. అంటాడు ఆయన మేనల్లుడు. ఏమి చూస్తావురా ఇటుక మీద ఇటుక అంటాడు రామకృష్ణుడు. బాహ్యదృష్టి పోవటం చాలా కష్టం.

రామకృష్ణుడు కాన్సర్ తోటి పీడింపబడిన రోజులలో నరేంద్రుడికి కూడా ద్వైతబుద్ధి వచ్చింది. ద్వైతబుద్ధి ఎంతకాలం అయితే మనిషికి ఉందో ఆ మనిషి ఎంత గొప్పవాడు అయినా వాడికి తప్పనిసరిగా సందేహం వస్తూ ఉంటుంది. ద్వైతబుద్ధిని దాటితేనే కానీ సందేహాలు ఆగవు. రామకృష్ణుడు కాన్సర్ వ్యాధితో పీడించ బడుతున్నప్పుడు, తన గురువు మీద తనకే అనుమానం వస్తుంది నరేంద్రుడికి, నువ్వు దేవుడి తోటి సమానమైన వాడివే కదా అనిఏదో కొత్త కొత్త సందేహాలు అతనికి వస్తాయి. నువ్వు నిజంగా ఈశ్వరుడివేనా? నువ్వు నిజంగా జ్ఞానివేనా? నువ్వు ప్రకృతిని దాటిన వాడవేనా? అని సందేహం వస్తోంది. లోపల అతనిని సందేహం పీడిస్తోంది, పైకి అడగటానికి సిగ్గుపడుతున్నాడు. ప్రకృతిని దాటకుండా ఎవడూ జ్ఞాని కాలేడు. ప్రకృతిని దాటని వాడికి ఈశ్వరుడు తన స్వరూపాన్ని ఇవ్వడు. అప్పుడు రామకృష్ణుడు అంటాడు "ఓ నరేన్ ఎవడైతే రాముడో, ఎవడైతే కృష్ణుడో వాడే ఈ రామకృష్ణుడు అన్నాడు. ఈశ్వరుడు మన భారాలను బయటకు గెంటాలి కాని మన శక్తి సరిపోతుందా మన భారాలన్నీ వదిలించుకోవడానికి? మనం భగవంతుడిని నిజంగా హక్కున చేర్చుకుంటే మనకి దుఃఖం ఎందుకు వస్తుంది? మీలో ఎవరికి అయినా నిజంగా దుఃఖం వస్తుంటే, భగవంతుడికి నిజంగా మనల్ని మనం అర్పించుకుంటే ఇంక దుఃఖ పడేవాడు ఎవడు ఉన్నాడు? అంటే

మనలో దుఃఖ పడేవాడు ఎవడైనా ఉంటే ఇంకా మనం వాడిని అర్పించటం లేదు అన్నమాట. అది అర్పణ ఎలా అవుతుంది? భగవంతుడికి కనుక నన్ను నేను అర్పించుకుంటే ఇంక దుఃఖ పడటానికి ఎవడు ఉన్నాడు? మీకు కొండ గుర్తుకి చెబుతున్నాను. మీకు ఎన్ని కష్టాలు వచ్చినా, బాధలు వచ్చినా, ఎంత పెద్ద కష్టం వచ్చినా చిన్న కష్టంగా కనిపిస్తుంటే, పెద్ద నష్టం కూడా చిన్న నష్టం కింద కనిపిస్తుంటే, అప్పుడు మీకు జ్ఞానం కలుగుతుంది. ఒక్క జ్ఞానానికే ఆ శక్తి ఉంది. పెద్ద పెద్ద సమస్యలు కూడా చిన్న సమస్యలుగా కనిపిస్తుంటే, పెద్ద పెద్ద కష్టాలు కూడా చిన్న కష్టాలుగా కనిపిస్తుంటే, వాడు జ్ఞానం వైపు ప్రయాణం చేస్తున్నట్టు. కొన్ని వస్తువులు నీటిలో ఎలా తేలిపోతాయో, అలాగే జ్ఞానం వైపు ప్రయాణించేటప్పుడు మనస్సుకి ఎన్ని కష్టాలు వచ్చినప్పటికీ తేలిపోతుంది. జ్ఞానాన్ని ముంచే శక్తి అక్కడ ఉండదు. భక్తులు కాని వారు ఎవరు ? అందరూ భక్తులే కానీ ఒక్క జ్ఞానికే నా స్వరూపం ఇస్తాను అన్నాడు పరమేశ్వరుడు. ఆయన స్వరూపం ఏమిటి? ఆత్మ.

మోక్షాన్ని సంపాదించటం కోసం మీరు వ్రతాలు చేస్తున్నారు, చాలా కష్టపడుతున్నారు, జపాలు చేస్తున్నారు, ధ్యానాలు చేస్తున్నారు, రైటే కానీ మరి మీరు ఇప్పుడు ఎక్కడ ఉన్నారు? రామకృష్ణుడు అంటాడు నీకు దేవుడు కనిపిస్తే, నాకు చెరువు తవ్వించాలి, నాకు కాలువ తవ్వించాలి అని అడుగుతావా? నాకు జ్ఞానాన్ని ఇమ్మని అడుగుతావా? నీవు చేసిన పూజలు ఫలితంగా, నోములు ఫలితంగా, దేవుడు కనిపిస్తాడు అనుకోండి మీరు ఏమి అడుగుతారు? ఈ ఒక్క ప్రశ్న మీరు సదా జ్ఞాపకం ఉంచుకోండి. ఏ పని చేసినా, మీరు

అందరం కాలాన్ని పాడుచేసుకొంటున్నాము.
మనం ఈ గొప్పలకు, గౌరవాలకు ఇచ్చే విలువ కూడా
కాలానికి ఇవ్వటంలేదు.



మోక్షం కోసమే చేస్తున్నారు. ఒక మంచి మాట చెప్పినా, ఒక మంచి మాట విన్నా, పరోపకారం చేసినా, సోషల్ సర్వీస్ చేసినా, ఏది చేసినా మీ మోక్షం కోసమే మీరు చేస్తున్నారు. నేను కాదు అనటం లేదు. కానీ ఇప్పుడు ఎక్కడ ఉన్నారు?

శృంగేరి పీఠంలో ఒకతను పొరపాటున ఏమి చేశాడు అంటే వంటలో ఉప్పు ఎక్కువ వేసేశాడు. ఒకరోజు కాదు, రెండు రోజులు కాదు మాములుగా అతనికి అలవాటు కొలది ఉప్పు ఎక్కువ పడిపోయింది. మాములు లౌకికులు అయితే ఒకరోజు కూడా సహించరు. భక్తులు కాబట్టి నాలుగు రోజులు సహించారు. అప్పుడు శృంగేరిస్వామి వారి దగ్గరకి వెళ్ళి "ప్రతీరోజు కూరలలో ఉప్పు ఎక్కువ అవుతోంది" అని చెప్పారు. స్వామివారు తెలివి గలవారు, ఆయన ఏమి చెప్పారు అంటే "నేను కేకేసి అతనితోటి నువ్వు కూరలలో ఉప్పు ఎక్కువ వేస్తున్నావు అని చెబితే నాలుగు రోజులు జాగ్రత్త పడతాడు, ఐదో రోజున వాడు మళ్ళీ మాములుగా ఉప్పు ఎక్కువ వేస్తాడు. మీకు వండిపెట్టిందే వాడు కూడా తింటున్నాడు కదా, వాడు ప్రత్యేకంగా కూర వండుకోవటం లేదు. అయితే ఉప్పు ఎక్కువ వేశాను అన్న సంగతి తినేటప్పుడు వాడికి తెలియటం లేదు, ఇంకొక రెండు రోజులు ఆగండి వాడికే తెలుస్తుంది. ఇంక మళ్ళీ ఎప్పుడూ ఉప్పు ఎక్కువ వెయ్యడు. ఇది వాడికి తెలిస్తే వాడికి కోపం రాదు, అయ్యో మనం ఐదు రోజుల నుంచి ఇంతమందిని బాధ పెట్టాం అని పశ్చాత్తాపం తోటి ఈ తప్పు ఇంక ఎప్పుడూ చెయ్యడు. అలా కాదు ఫలానా వాళ్ళు చెప్పారు అని మీ అందరి ముందు నేను ఆ కుక్‌ని కేకేసి తిడితే వాడు తన పొరపాటును సవరణ చేసుకోడు సరికదా, వాడికి కోపం వస్తుంది. మీరు అందరూ నా మీద నేరాలు చెబుతారా? పైగా తినేసి ఇటువంటి గొడవలు లోకి దూరుతున్నారు అనుకుంటాడు. అయ్యో నాలుగురోజుల నుంచి మనం ఇంతమంది భక్తులని బాధ పెడుతున్నాం అని హృదయంలో తనకి పశ్చాత్తాపం కలిగితే మళ్ళీ ఈ పొరపాటు వాడు జీవితంలో చెయ్యడు. అందుచేత ఇంకొక్క రెండు రోజులు ఓపిక పట్టండి. మళ్ళీ ఎన్నడూ అతను జీవితంలో ఉప్పు ఎక్కువ వెయ్యడు" అని చెప్పారు. ప్రతీ మనిషికి కూడా తన అనుభవం తనకి రావాలి. ఎదుటివాడి అనుభవాన్ని తన స్వంతం చేసుకోవడానికి వాడు మహామేధావి అయ్యుండాలి.



చూచి చింతించి మేనుందాకి పక్వము

చేసి నీ వేలి బ్రో వరుణాచలా। 63।

చూచి, చింతించి మేనుం దాకి : అరుణాచలేశ్వరుడు తోటి నావంక చూడమంటున్నాడు రమణస్వామి. పవిత్రమైన హృదయం గలవాడు ఒకసారి మన వంక చూస్తే చాలు. రమణస్వామి దగ్గరకి చాలామంది లోకానికి సంబంధించిన కోరికలతోటే వెళ్ళేవారు. ఆయన వారి వంక చూసేవాడు. ఆ దేహప్రారబ్ధాన్ని బట్టి వాళ్ళ కోరికలు నెరవేరవచ్చు, నెరవేరక పోవచ్చు, ఏదైనా స్వప్నమే. వారికి ఏది మంచిదో గురువుకి తెలుసు గాని పాపం వారికి తెలియదు. సర్వసాధారణంగా దేవాలయంలోకి వెళ్ళినా, జ్ఞాని దగ్గరకి వెళ్ళినా, భక్తులు కూడా లోకానికి సంబంధించిన ప్రయోజనాలు ఆశించి వెళతారు. అయితే ఆ దేవుడే మానవ రూపం ధరించి గురువుగా వస్తే, మానవజాతిని అపూర్వంగా, ఉదాత్తంగా ప్రేమిస్తున్న నిజమైన గురువు కనుక అయితే, ఆయన ఒక్క చూపు వల్ల ఈ శిష్యుడి యొక్క మనస్సుని ఆత్మ వైపుకి గురి పెట్టేలాగా చేస్తాడు. నువ్వు ఏ ఉద్దేశ్యంతో, ఏ సంకల్పంతో, ఈ లోకానికి కాని, పరలోకానికి కాని సంబంధించిన ప్రయోజనం కోరి వెళ్ళినా నీ దృష్టిని ఆత్మ వైపు తిప్పుతాడు.

నీకు కళ్ళు కనపడవు, రోజు ఎందుకు నన్ను చూడటానికి వస్తావు అని రమణస్వామి ఒక గుడ్డి అమ్మని అంటారు. నేను నిన్ను చూడటం ముఖ్యం కాదు. నీ కళ్ళు నా మీద పడతాయని వస్తున్నాను అని చెప్పింది. అంటే, నిజమైన గురువు ఒక్కసారి మీ వంక చూస్తే, మీ పని పూర్తి అయిపోయినట్టే, మీలో ఉన్న అజ్ఞానం అనే గడ్డిమేటుకి అగ్గిపుల్ల

వెలిగించినట్టే. గురువు అంటే ఈశ్వరుడు, అటువంటి చూపు చూస్తాడు.

ఓ అరుణాచలేశ్వరుడా! నాకు ఏది హితవో, ఏది శ్రేయస్సో, ఏది మోక్షాన్ని ప్రసాదిస్తుందో, అటువంటి చూపు చూడవయ్యా నా వంక. నేను ఏదో ప్రయోజనం కోసం నీ దగ్గరకి వచ్చినా, ఏ చూపు చూడటం వల్ల నేను శోకానికి, మోహానికి దూరం అవుతానో, అటువంటి చూపు చూడవయ్యా. నా మనసులో ఉన్న రోగాల కొలది నిన్ను ఆశ్రయించినా, అది నువ్వు పరిగణనలోకి తీసుకోకు.

ఇక్కడ రమణస్వామిలో ఉన్న విశేషం ఏమిటంటే, ఒకరు ధనాపేక్ష తోటి భగవాన్ దగ్గరకి వెళ్ళినా, దేహప్రారబ్ధాన్ని బట్టి అతనికి ధనం వచ్చినా రాకపోయినా, భగవాన్ చూపు వల్ల అతనికి ధనం మీద అపేక్ష కూడా పోయేది. ధనం గొడవ మర్చిపోయి వరదలు వచ్చినప్పుడు తీవ్రమైన నదీప్రవాహంలో గడ్డిపరక వేస్తే ఎంత వేగంగా కొట్టుకుని వెడుతుందో, ఒక్కసారి భగవాన్‌ను చూడటం వల్ల అంత వేగంగా మనస్సు ఆత్మ వైపు కొట్టుకుని వెళు తుంది. ఒక వ్యక్తి లోక ప్రయోజనాల కోసమే ఆయన దగ్గరకు వెళ్ళినా మహావేగంతోటి ఆత్మ వైపు ప్రయాణం చేస్తాడు; అది గురువు యొక్క చూపు. ఆ పని పూర్తి అయ్యేవరకు గురువు విడిచిపెట్టడు.

చింతించి – చింతించటం అంటే భావన చేయటం. మీకు ఏదైనా కష్టం ఉంటే, బాధ ఉంటే, మీకున్న కష్టం, లేకపోతే మీకున్న దుఃఖం, జ్ఞాని యొక్క హృదయంలో వెయ్యండి మీకు రెండు వంతుల బరువు తగ్గుతుంది. జ్ఞాని తలంపులోకి మనం ఎప్పుడైనా వెళితే చాలు. అది కూడా దీక్ష అవుతుంది అంటున్నారు రమణస్వామి. ఒకరిని ఒకరు ఎదురుగా చూసుకోవక్కర్లేదు. ఆత్మ అంతటా ఉంది. జ్ఞాని అంటే ఆత్మే. అందుచేత మీ యొక్క తలంపు జ్ఞాని హృదయంలో పడితే, అంటే జ్ఞాని యొక్క హృదయంలో మనం ఒక మాట వేస్తే, మన కష్టం ఒకసారి చెప్పుకుంటే అక్కడే కరిగిపోతుంది.

గంగానదిలో స్నానం చేస్తే పాపాలు పోవచ్చు. కానీ జ్ఞాని దర్శనం చేస్తే పాపాలే కాదు పాపాలు చేసే బుద్ధి కూడా పోతుంది. ఒక్కసారి జ్ఞానిని దర్శిస్తే జీవితంలో ఎంతో

మలుపు వస్తుంది. కొంతమందికి వెంటనే రావచ్చు, కొంతమందికి లేటుగా రావచ్చు. కానీ జ్ఞానిని దర్శనం చెయ్యటం వల్ల వచ్చిన ప్రయోజనం ఊరికే పోదు, ఒక మెట్టు పైకి వెళతారు. ఓ అరుణాచలేశ్వరుడా! నా వంక చూసి నన్ను పక్వానికి తీసుకురా. లేకపోతే చింతించు, నన్ను స్మరణలో పెట్టుకో, నీ జ్ఞాపకంలో పెట్టుకో. **మేనుందాకి** – టచ్ చెయ్యి, అంటే స్పర్శ చెయ్యటం. నువ్వు నన్ను చూస్తావు, నీ కడుపులో నన్ను పెట్టుకుంటావు, కాని అప్పుడు కూడా పక్వానికి రాననుకో, ఇక నా ఎదురుగా వచ్చి, అవసరమైతే నన్ను ముట్టుకో. physical కాంటాక్ట్ వల్ల అయినా సరే బాగు చెయ్యటం ముఖ్యం. రామకృష్ణుడు వివేకానందని ఒకసారి స్పర్శ చేశాడు. కానీ ఆత్మ వైభవాన్ని చూడటానికి అక్కడ శక్తి చాలక, అటాచ్మెంట్ తెంచుకోలేక, నా కుటుంబానికి నన్ను దూరం చేసేస్తున్నావా, నన్ను ఏమి చేసేస్తున్నావు అంటాడు నరేంద్రుడు. ఒక్క స్పర్శ వల్ల అతని మనసులో వాసనలు, కోరికలు రాలిపోవటానికి పునాది వేశాడు రామకృష్ణుడు.

చూచి చింతించి మేనుం దాకి – అంటే నన్ను టచ్ చెయ్యి, స్పర్శ వలన కూడా పక్వత వస్తుంది. మొత్తం మీద రోగం తగ్గాలి. నీ చూపు నా మీద పడితే సరిపోతే కనుక భావనా దీక్ష, స్పర్శ దీక్ష అక్కర్లేదు. చూపు ఒక్కటే చాలకపోతే భావనా దీక్ష ఇయ్యి, అదీ చాలదనుకో స్పర్శ దీక్ష చెయ్యి. ఒకవేళ బలం చాలదనుకో మూడు కలిపే చెయ్యి. మనిషి బాగుపడటానికి భక్తి, జ్ఞాన, ధ్యాన, కర్మ యోగాలలో ఒకటి చాలు. ఒక యోగం చాలనప్పుడు నాలుగు యోగాలు కలపవచ్చు, అలాగే మూడు వేరుగా ప్రయోగించినా నేను పక్వానికి వచ్చేస్తాను, ఒకవేళ రాకపోతే మూడు కలిపే ప్రయోగించు అంటున్నాడు రమణస్వామి. ఏదో ఒక రకంగా నన్ను పక్వానికి తీసుకురావటం ముఖ్యం. **చూచి చింతించి మేనుం దాకి పక్వము చేసి** – నన్ను రక్షించవయ్యా, ఈ మూడు ప్రయోగించి నన్ను పక్వానికి తీసుకురా. ఏ రకంగా ముగ్గినా, మొత్తం మీద ముగ్గాలి. చెట్టుకి ముగ్గకుండా, బుట్టలో ముగ్గకుండా ఉంటే ఆ కాయ కుళ్ళిపోతుంది. అలా కుళ్లిపోయేలా చెయ్యకు, ఈ జన్మలోనే నన్ను పక్వానికి వచ్చేలా చెయ్యి.

మన సాధన కరెక్టుగా ఉండాలి. ముందు మీరు సబ్జెక్టు నేర్చుకోండి. భక్తులు వాళ్ల ఇష్టదైవాన్ని పూజిస్తున్నారు కాబట్టి వాళ్ల కోరికలు నెరవేరుతున్నాయి అనుకుంటారు. అంటే ఆంజనేయస్వామి వేరు, విఘ్నేశ్వరుడు వేరు, వెంకటేశ్వరస్వామి వేరు అనే భావన వచ్చేస్తుంది. మీరు ఏ రూపాన్ని ఆరాధించినప్పటికీ మీ కోరిక నెరవేర్చేవాడు మీ హృదయంలో చైతన్యరూపంలో ప్రకాశిస్తున్న దేవుడే. కానీ ఆ రూపాన్ని ఆరాధించటం వలన ఆ రూపం మన కోరిక తీరుస్తుంది అని మనకు అనిపిస్తుంది. ఉన్నది ఒక్కటే, వాడే ఈశ్వరుడు, వాడే ప్రకాశించేవాడు, వాడే చైతన్య స్వరూపుడు. మీరు ఏ రూపాన్ని ప్రార్థిస్తున్నప్పటికీ, మీకు ఏ కోరికలు నెరవేరుతున్నప్పటికీ మీ హృదయంలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడు చేస్తున్నాడనే భావన మీకు కలగాలి. అపరిపక్వ స్థితి ఉన్న వాళ్లకి శాస్త్రం ఎన్ని సార్లు చదివినా దండగే. మానసికంగా పక్వానికి రాని మనిషికి, బుద్ధి వికసించని మనిషికి శాస్త్రం ఎన్ని సార్లు చదివినా అర్థం కాదు. నన్ను పక్వానికి వచ్చేలా చెయ్యి. **నీ వేలిబ్రోవు** – నన్ను రక్షించి, నీ చేతిలోకి నన్ను తీసుకో అరుణాచలా అంటున్నారు.

రమణ భాస్కర చందాదారులకు విన్నపం

సంవత్సర చందా రు॥ 150/-లు.


శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు.

రమణ భాస్కర చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము. మీ చందాను స్వయంగా గానీ లేక

శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి

అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.

ఓం శ్రీ నాన్నపరమాత్మనే నమః



అరుణాచల మహాదీపోత్సవం

సందర్భంగా ఈ నెల 24వ తేదీ మంగళవారం
జిన్నూరు శ్రీ రమణ క్షేత్రంలో జరుగు కార్యక్రమములు

ఉ॥ 6 గం లకు	:	పారాయణం
ఉ॥ 6 -45 గం లకు	:	నెమలి,శేష వాహనముల పై గిరిప్రదక్షిణ
ఉ॥ 7 గం లకు	:	అల్పాహారం
ఉ॥ గం 9:30 ని లకు	:	సత్సంగం
ఉ॥ 11 గంలకు	:	అన్న ప్రసాదం
మ॥ 3 గం లకు	:	సత్సంగం
సా॥ 5 గం లకు	:	పూజాకార్యక్రమం
సా॥ 6 గం లకు	:	దీపోత్సవం

భక్తులందరికీ ఆహ్వానం

శ్రీ రమణ క్షేత్రం జిన్నూరు 🙏🙏🙏

అరుణాచల దీపం

స్మరణ మాత్రముననే పరముక్తి ఫలదః కరుణామృత జలధి అరుణాచలమిది॥ అరుణాచలం గురించి, అట్లే అరుణాచల రమణుని గురించి ఎరుగని వారుండరు. భగవాన్ శ్రీరమణమహర్షికీ, అరుణాచల పర్వతానికి మధ్య ఉన్నది అవినాభావ సంబంధమే. అరుణాచలం శివశక్తులను సూచిస్తుంది. అదేవిధముగా "అరుణాచల దీపోత్సవం" చాలా గొప్ప పండుగ. ఈరోజు అనంతుడైన సదాశివుడు, బ్రహ్మగారికి విష్ణువుకి జ్యోతిరూపంగా వ్యక్తమైనరోజు. కార్తీకదీపం యొక్క నిజతత్వాన్ని శ్రీమురుగనార్‌కి భగవాన్ శ్రీరమణమహర్షి ఇలా వివరించారు, "మనందరికీ దేహము నేనుగా వ్యక్తమవుతోంది అట్టి దేహము నేను అనెడి మూల తలంపును దాని మూలమైన హృదయంలో నశింపజేసి, నిజమైన నేనును తానుగా అనుభవైకవేద్యం చేసుకోవడమే నిజమైన దీపదర్శనం; కార్తీక దీపం మనస్సును లోనికి మరలించి హృదయములోకి చేర్చి అందులో మునుగునట్లు చేస్తుంది". ఏ శుభ కార్యాన్నైనా పూజా కార్యక్రమమైనా దీపారాధనతో మొదలుపెడతాం. జగత్తుకు సూర్యుడు ఆధారం. బయటి చీకటిని సూర్యుడు, చంద్రుడు పోగొడితే, లోపలి చీకటిని హృదయంలో స్వరూపంగా ఉన్న సద్గురువు పోగొడతారు. అరుణగిరికి ఒక పేరు ఉంది "చంపక చంపెడు మందు" అని. శరీరాన్ని చంపకుండా అహంకారాన్ని నిర్మూలిస్తుంది. అసలు అరుణాచలం ఎందుకు వచ్చిందో? అది చేసే పని ఏమిటో? అక్షరమణమాలలో మొదటి ద్విపదలోనే భగవాన్ చెప్పారు. "అరుణాచలమనుచు స్మరింయించువారల అహము నిర్మూలింతువు అరుణాచలా!" అని. ఊరు పేరు అరుణాచలం, దేవుడు పేరు అరుణాచలేశ్వరుడు, కొండపేరు అరుణాచలం. సదాశివుడు బ్రహ్మ విష్ణువుల కలహాన్ని తీర్చి అనుగ్రహించాడు, ఆ అనుగ్రహమే గిరి రూపు దాల్చింది. దేవతలకు, మానవులకు ఆరాధ్యమైంది అదే అరుణాచలం. అరుణాచల దీపదర్శనం మన మనస్సు దాని మూలములో లీనమగుటకు సాయపడుతుంది. మనస్సు దాని మూలమైన హృదయంలో నశిస్తే ఆనందం స్వరూపంగా వ్యక్తమవుతుంది. ఎవరైనా చిత్తశుద్ధి అనే గేటు ద్వారానే అద్వైతానుభవం పొందాలి. అందుకు మన తలంపు, మాట, చేత ఒకటిగా ఉండాలి. ప్రతిక్షేత్రానికి ఒక మహిమ ఉంటుంది, అరుణాచలమునకు అహంకారాన్ని నిర్మూలించే కొండగా పేరు. వేంకటరామన్‌ను చిన్న వయస్సులోనే అరుణగిరి తనవైపుకు ఆకర్షించుకొని తన వాడిని చేసుకుంది. అరుణగిరి భౌతిక నేత్రాలకు శిలాకారంగాని, అసలు జ్యోతి స్వరూపమే అన్నారు భగవాన్ రమణమహర్షి. అటువంటి అరుణాచల దీప దర్శనాన్ని అనేకసార్లు సద్గురువు శ్రీనాన్నగారితో కలిసి, వారి సమక్షంలో వీక్షించే భాగ్యం మనకు లభించింది.

- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064